సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 6 । జనవరి । 2024



హోరాహోరీగా టోర్నీ
కిన్నెరసానిలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి గిరిజన పాఠశాలల క్రీడాపోటీలు శుక్రవారం రెండో రోజుకు చేరాయి. 10లో



అందని రైతుబంధు
యాసంగి రైతుబంధు పథకం నత్తనడకన సాగుతుండగా, ఉమ్మడి జిల్లా రైతులు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
30°/ 19°
వాతావరణం
జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం, రాత్రి వేళ చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం జరిపారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంధం వెంగళరావు, కిలారు నాగమల్లేశ్వరరావు భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

ఆలయంలో నేటి నుంచి ఈ నెల 8వ తేదీ వరకు పవిత్రోత్సవ పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు.

ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి



దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

జూలూరుపాడు: ఆరు గ్యారెంటీల కోసం ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని జెడ్పీ సీఈఓ విద్యాలత సూచించారు. శుక్రవారం వెంగన్నపాలెం ప్రజాపాలన గ్రామసభను ఆమె సందర్శించి మాట్లాడారు. సలహాలు, సూచనల కోసం హెల్ప్ డెస్క్, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, సెర్ప్ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ మీనా, వెంగన్నపాలెం సర్పంచ్ గలిగె సావిత్రి, ఎంపీటీసీ సభ్యుడు దుద్దుకూరి మధుసూదన్‌రావు, ఉపసర్పంచ్ దేవరకొండ కిరణ్, ఏఈఓ గౌస్, జేవీఓ పూర్ణచందర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, సెర్ప్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్‌కు ఉచిత శిక్షణ

ఖమ్మం మామిళ్లగూడెం: గ్రూప్ 1, 2, 3, 4 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఖమ్మంలోని బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీల్లో డిగ్రీ అర్హత ఉండి రూ.5లక్షల లోపు వార్షికాదాయం కలిగిన అభ్యర్థులు ఈనెల 8 నుండి 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల 1నుండి నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. రిజర్వేషన్, డిగ్రీ మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు పూర్తి వివరాల కోసం 08742-227427, 95738 59598, 94419 31359 నంబర్లకు సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

నేటితో ముగియనున్న ప్రజాపాలన సభలు




దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

చుంచుపల్లి: ప్రజాపాలన సభల్లో స్వీకరించిన అభయహస్తం దరఖాస్తుల వివరాలను అధికారులు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చారు. వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న 637 మంది కంప్యూటర్ ఆపరేటర్లను డేటా ఎంట్రీకి కేటాయించి, శుక్రవారం శిక్షణ కూడా ఇచ్చారు. ప్రతీ దరఖాస్తుకు ప్రత్యేకంగా యూనిట్ కోడ్ నంబర్‌ను కేటాయించి లబ్ధిదారుల వివరాలను పొందుపర్చుతారు. భవిష్యత్తులో యూనిట్ కోడ్ నంబర్‌కు ఆధార్‌ను అనుసంధానం చేయనున్నట్లు సమాచారం. గత నెల 28 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమల్లో భాగంగా గ్రామ, వార్డు సభల ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తోంది. జిల్లాలో శుక్రవారం వరకు 441 గ్రామ పంచాయతీలు, 104 మున్సిపల్ వార్డుల పరిధిలో 2,91,827 అభయహస్తం దరఖాస్తులు రాగా, నేటితో గ్రామసభలు ముగియనున్నాయి.

పోరుబాటలో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక జరిగిన జిల్లాల పునర్విభజనలో భద్రాచలం డివిజన్‌కు తీరని అన్యాయం జరిగింది. మండలాలతోపాటు భద్రాచలం కేంద్రంగా ఉన్న అనేక డివిజన్ కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లాయి. ఈ నేపథ్యంలో ములుగులో కలిపిన వెంకటాపురం, వాజేడు మండలాలను పూర్వ జిల్లాలో, ఏపీలో కలిసిన ఐదు పంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలపాలని కోరుతూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో స్థానికులు మరో పోరాటానికి సిద్ధమవుతున్నారు.

– భద్రాచలం



తొలుత 8 మండలాలతో..

భద్రాచలంలో అసెంబ్లీ నియోజకవర్గంలో తొలుత 8 మండలాలు ఉండేవి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో పోలవరం ముంపు పేరుతో కూనవరం, చింతూరు, వీఆర్‌పురం మండలాలను పూర్తిగా, భద్రాచలం పట్టణం మినహా ఇతర గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. ప్రస్తుతం ఐదు మండలాలు భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు ఉన్నాయి. 'అసెంబ్లీ' భద్రాచలమే అయినప్పటికీ జిల్లాల పునర్విభజనలో వెంకటాపురం, వాజేడు మండలాలను ములుగు జిల్లాలో కలిపారు.

కొత్త ప్రభుత్వంపైనే ఆశలు..

గతంలో అధికారంలో ఉన్న పార్టీ తన స్వలాభం కోసం ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా జిల్లాల పునర్విభజన చేపట్టిందని కాంగ్రెస్ ఆరోపించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఎన్నికల ప్రచారానికి ముందు భద్రాచలం వచ్చిన క్రమంలో ఈ ప్రాంత అభివృద్ధికి, ఏపీలో కలిపిన ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వమే కొలువుదీరగా, ఈ ప్రాంతవాసుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. భద్రాచలానికి మరోసారి అన్యాయం జరగొద్దనే ఉద్దేశంతో పలు రాజకీయ పార్టీలు, ప్రజా, కుల సంఘాల నాయకులు, ప్రముఖులు మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నారు. ములుగు, వెంకటాపురం మండలాలను తిరిగి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కలపాలని, ఏపీలో కలిపిన కన్నాయిగూడెం, పిచుకలపాడు, గుండాల, యటపాక, పురుషోత్తపట్నం గ్రామాలను భద్రాచలం డివిజన్‌లో కలపాలని పేర్కొంటూ పోరాటాలకు సిద్ధమవుతున్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని మరోసారి చాటుతామని పేర్కొంటున్నారు.

భద్రగిరి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రముఖులు

- భద్రాచలం డివిజన్ భౌగోళిక పరిరక్షణకు మరో ఉద్యమం
- వెంకటాపురం, వాజేడు మండలాలను భద్రాద్రి జిల్లాలో కలపాలి
- విలీన పంచాయతీలను తిరిగి తెలంగాణలోకి తేవాలని డిమాండ్
- నియోజకవర్గాల పునర్విభజనపై ప్రజల్లో ఆందోళన

మళ్లీ పునర్విభజన జరిగితే..

గతంలో భద్రాచలం అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గంగా కొనసాగింది. 2003లో 87వ రాజ్యాంగ సవరణ ద్వారా 2001 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేశారు. ఈ క్రమంలో ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న భద్రాచలం పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రాన్ని మహబూబాబాద్‌కు మార్చారు. ఇదే క్రమంలో 2024లో మళ్లీ నియోజకవర్గ పునర్విభజన జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వెంకటాపురం, వాజేడు మండలాలను ములుగు జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గంలో విలీనం చేస్తే.. భద్రాచలంలో కేవలం మూడే మండలాలు మిగులుతాయి. ఇదే జరిగితే భద్రాచలం నియోజకవర్గ కేంద్రం కూడా మారే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ములుగు, వెంకటాపురంతోపాటు మరికొన్ని మండలాలను కలిపి భద్రాచలం నియోజకవర్గాన్ని కొనసాగించాలనే డిమాండ్ తెర మీదకు వచ్చింది.

రిలే దీక్షలు చేపడతాం



ములుగు జిల్లాలో కలిపిన వెంకటాపురం, వాజేడు మండలాలను తిరిగి భద్రాద్రి జిల్లాలో కలపాలి. నియోజకవర్గ కేంద్రం మారితే భద్రాచలం డివిజన్ ఉనికికే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే అన్ని విధాలా నష్టపోయింది. ఆ నష్టం మళ్లీ జరగకుండా ప్రజలు ముందుకు రావాలి. ఇందుకోసం త్వరలో రిలే దీక్షలను చేపట్టనున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం, ఉమ్మడి జిల్లా మంత్రులు సానుకూలంగా స్పందించాలి.

–చల్లగుళ్ల నాగేశ్వరరావు, తెలంగాణ ఉద్యమ నాయకుడు, టీఎన్‌జీఓస్ జిల్లా మాజీ అధ్యక్షుడు

భాగస్వాములు కావాలి



పెద్ద మండలాలుగా ఉన్న దుమ్ముగూడెం, చర్లలో కొన్ని గ్రామాలను కలిపి సీతారామ మండలంగా ప్రకటించాలి. నియోజకవర్గాల పునర్విభజన జరిగినా వాజేడు, వెంకటాపురం మండలాలను భద్రాచలంలోనే కొనసాగించాలి. ఏపీలో విలీనం చేసిన ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలి. ఇదే డిమాండ్‌తో ఉద్యమ కార్యాచరణ చేపడతాం. సలహాలు, సూచనల కోసం ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశాం. ప్రజలందరూ భాగస్వాములు కావాలి.

–పూనెం ప్రదీప్‌కుమార్, స్వచ్ఛంద సంస్థ సభ్యుడు

కొత్త ఎస్పీకి సవాళ్లు!



- జిల్లా మీదుగా నిత్యం గంజాయి రవాణా
- మావోయిస్టుల పోరుతో ఏజెన్సీలో తరచూ ఉద్రిక్తత
- దొంగతనాలు, ఇతర శాంతిభద్రతల సమస్యలు కూడా
- నేడు ఎస్పీగా రోహిత్‌రాజు బాధ్యతల స్వీకరణ

కొత్తగూడెంటౌన్: జిల్లాలో ప్రధానంగా గంజాయి అక్రమ రవాణాతో పాటు మావోయిస్టు కార్యకలాపాలు, చోరీలు పోలీస్ శాఖకు సవాల్‌గా మారుతున్నాయి. శనివారం జిల్లా ఎస్పీగా బిరుదురాజు రోహిత్‌రాజు బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక కథనం. జిల్లా అత్యధికంగా గ్రామీణ ప్రాంతాలు, నాలుగు మున్సిపాలిటీలు, పర్యాటకం, గిరిజన ప్రాంతాలు, సింగరేణి, విద్యుదుత్పత్తి కేంద్రాల వంటి పరిశ్రమలతో విభిన్న అంశాల మేళవింపుగా ఉంది. రాజకీయ ఉద్యమాలకు కూడా పెట్టింది పేరు. అసాంఘిక శక్తుల ప్రమేయం కూడా కనిపిస్తూ ఉంటుంది. గంజాయి రవాణాను, మావోయిస్టు కార్యకలాపాలు, చోరీలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. అయితే వీటిని అరికట్టేందుకు పోలీస్‌శాఖ చర్యలు తీసుకుంటున్నా.. ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోతోందనే విమర్శలు ఉన్నాయి. భద్రాచలం ఏజెన్సీ, సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టులు, పోలీసులకు నిరంతర పోరుతో ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల్లో భయాందోళన నెలకొంది. గంజాయి అక్రమ రవాణాలో సూత్రధారులను వదిలేసి, కేవలం రవాణా చేసేవారినే అరెస్ట్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. సూత్రధారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటేనే, పోలీస్ శాఖ ప్రకటిస్తున్నట్లు జిల్లాను గంజాయి రహితంగా మార్చవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సారు జిల్లాకు సుపరిచితమే..

ఎస్పీగా రానున్న రోహిత్‌రాజ్‌కు జిల్లాతో గతంలోనే పరిచయం ఉంది. 2018 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రోహిత్‌రాజు 2020లో జిల్లాలోని ట్రైనీ ఐపీఎస్‌గా పోస్టింగ్ పొందారు. అనంతరం రెండేళ్లపాటు భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచ ఏఎస్పీగా కూడా పనిచేశారు. ఆ సమయంలో వృత్తిపట్ల నిబద్ధత, ప్రజలు, ముఖ్యంగా యువతతో సత్సంబంధాలు కలిగి ఉన్నారనే పేరుంది. ప్రస్తుతం జిల్లాలో సవాల్‌గా మారిన సమస్యలను అరికట్టేందుకు గతంలో పనిచేసిన అనుభవం ఉపయోగపడే అవకాశం ఉంది. కాగా జిల్లాలో 2022లో 5,274 కేసులు, 2023లో 5,293 నమోదయ్యాయి. వీటిలో మావోయిస్టుల అరెస్టులు, లొంగుబాటు, గంజాయి, పోక్సో కేసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2024లో నేరాల సంఖ్య తగ్గించేందుకు కృషి చేయాల్సిన బాధ్యత కొత్తగా ఎస్పీపై ఎంతైనా ఉంది.

బూర్గంపాడు విద్యార్థికి బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న రోహిత్ రాజ్

బూర్గంపాడు: మండల కేంద్రానికి చెందిన కోట రోహిత్ రాజ్ హైదరాబాద్‌లోని జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. ఉత్తమ ప్రతిభ కనబర్చి యూనివర్సిటీ మొదటి ర్యాంక్ సాధించాడు. శుక్రవారం జరిగిన యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్, తదితరుల చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు. రోహిత్ రాజ్ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల స్థానికంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

'ప్రజాపాలన' ఆన్‌లైన్ చేయాలి

- డేటా ఎంట్రీపై పటిష్ట పర్యవేక్షణ, భద్రత
- కలెక్టర్ ప్రియాంక ఆల



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతీ దరఖాస్తును జాగ్రత్తగా ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో గ్రామపంచాయతీ, ఉపాధి హామీ పథకం, రెవెన్యూ, మున్సిపల్, ధరణి, మీ సేవా, టైపిస్టులతో అభయహస్తం దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఇదే అంశంపై నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తు సమాచారం ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. డేటా ఎంట్రీ శనివారం నుంచి ప్రారంభించి, ఈ నెల 17వరకు పూర్తి చేయాలని చెప్పారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీపీఓ, జెడ్పీ సీఈఓలు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వివరాల నమోదులో ఆధార్‌నంబర్, తెల్లరేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. డేటా నమోదుకు గ్రామపంచాయతీ, ఉపాధి హామీ పథకం, రెవెన్యూ, మున్సిపల్, ధరణి, మీ సేవా కేంద్రాల్లో పనిచేసే ఆపరేటర్లతోపాటు టైపిస్టుల సేవలను వినియోగించుకోవాలన్నారు. పొరబాట్లు లేకుండా, ఎవరి లాగిన్‌లో వారే ఎంట్రీ చేయాలని వివరించారు. సలహాలు, సందేహాలుంటే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. రెండు షిఫ్టుల్లో నమోదు ప్రక్రియ చేపట్టాలని, గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డుల వారీగా టీములు కేటాయించాలని వివరించారు. డేటా ఎంట్రీ పూర్తయ్యే వరకు సిబ్బందికి సెలవులు అనుమతించబోమని తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరణకు శనివారం ఒక్కరోజు మిగిలి ఉందని, ఎక్కువ సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. శుక్రవారం గ్రామసభల్లో 46,470 గృహాల లబ్ధిదారుల నుంచి 49,257 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. అనంతరం డిస్ట్రిక్ట్ లీడ్ మేనేజర్ పార్థసారథి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, డీపీఓ రమాకాంత్, జెడ్పీ సీఈఓ విద్యాలత, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, జిల్లా సహకార అధికారి ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు సమష్టి కృషి

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలి
- సింగరేణి నూతన సీఎండీ బలరామ్



మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యసాధనకు అందరూ సమష్టిగా, అంకితభావంతో కృషిచేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ సూచించారు. సింగరేణి సీఎండీగా బాధ్యతలు స్వీకరించాక శుక్రవారం ఆయన తొలిసారిగా జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న వేసవిలో థర్మల్ విద్యుత్‌కేంద్రాల వద్ద 21 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండేలా రోజుకు 2.24 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని, రోజుకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్‌బర్డెన్‌ను తొలగించాలని ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే, ఈ ఏడాది మొదటి 9 నెలల కాలంలో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్‌బర్డెన్ తొలగింపు ఆశాజనకంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న మూడు నెలల్లో లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. నూతన ప్రాజెక్టుల ప్రారంభానికి ఎదురవుతున్న అవాంతరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి భూసేకరణ, ఇతర అనుమతులపై ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, జె.ఆల్విన్, జీఎంలు ఎం.సురేష్, జక్కం సురేష్, మల్లెల సుబ్బారావు, దేవేందర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో వనమహోత్సవం

ఈ నెల 10 వరకు డిపోల వారీగా వనభోజనాలు

- అధికారులు, ఉద్యోగుల్లో స్నేహసంబంధాల మెరుగు
- ఖమ్మం రీజియన్‌లో 2,600 మంది ఉద్యోగులు



కొత్తగూడెం డిపోలో భోజనాలు చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

చుంచుపల్లి: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగుతోంది. సంస్థ ఆదాయం పెంపుపై దృష్టి సారించడంతోపాటు ప్రయాణికులకు మెరుగైన సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తోంది. గతంలో అధికారులు వారంలో రెండుసార్లు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ప్రయాణికులతో ఉద్యోగులు, సిబ్బంది సాదకబాధకాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. వివిధ రూట్లలో ఎదురవుతున్న సవాళ్లను పరిశీలించడంతోపాటు ఆదాయ, వ్యయాలపై అధ్యయనం చేశారు. ఇది కొంత సత్ఫలితాలనివ్వగా.. తాజాగా విధుల నిర్వహణలో ఒత్తిడికి లోనవుతున్న ఆర్టీసీ సిబ్బందికి ఉపశమనం కలిగించేలా ఆర్టీసీ యాజమాన్యం వనభోజనాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

అందరూ మమేకమయ్యేలా..

సంస్థ నిర్దేశించిన లక్ష్యాలు సాధించేందుకు ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది మమేకమయ్యేలా వనభోజనాల కార్యక్రమం ఉపయోగపడుతుందని యాజమాన్యం భావిస్తోంది. ఈ నెల 3 నుంచి 10 వరకు అన్ని డిపోల పరిధిలో వనభోజనాల కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయగా, ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే నాలుగు డిపోల పరిధిలో నిర్వహించారు. మిగిలిన డిపోల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది.

రూ. లక్ష వరకు వ్యయం

మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం డిపోల పరిధిలో వనభోజనాలు పూర్తయ్యాయి. కొత్తగూడెం డిపోలో శుక్రవారం వనభోజనాలు నిర్వహించారు. ఇక్కడ హాజరుకాలేకపోయిన సుమారు 70 మందితో కలిపి ఇల్లెందు డిపోలో ఈ నెల 9న నిర్వహించనున్నారు. ఖమ్మం డిపోలో 600 మంది ఉద్యోగులు ఉండగా, రెండు విడతలుగా వనభోజనాలు నిర్వహించాలని నిర్ణయించారు. తొలి విడతగా సుమారు 300 మంది నిర్వహించారు. మిగిలినవారితో మరో కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. ఇక మిగిలిన భద్రాచలం, మణుగూరు డిపోల్లో కూడా రెండు, మూడు రోజుల్లో నిర్వహించనున్నారు. 500 లోపు సిబ్బంది ఉంటే రూ. 75 వేలు, అంతకంటే ఎక్కువ మంది సిబ్బంది ఉంటే రూ.లక్ష వరకు ఖర్చు చేయడానికి ఆర్టీసీ యాజమాన్యం అవకాశం కల్పించింది. ఈ వేడుకల్లో అధికారులు కూడా పాల్గొంటుండటంతో ఉద్యోగులను ప్రోత్సహించినట్లవుతోంది. ప్రైవేటు అద్దె బస్సుల యాజమాన్యాలు, సిబ్బందిని సైతం ఇందులో భాగస్వామ్యం చేస్తున్నారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల కోసం 2019లో చేసిన సుదీర్ఘ సమ్మె నేపథ్యంలో అప్పటి సీఎం కేసీఆర్ ఉద్యోగులను పిలిపించి వనభోజనాలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. దీంతో 2020 జనవరి 8న ఆర్టీసీ డిపోల పరిధిలో సిబ్బందిని వనభోజనాలకు తీసుకెళ్లారు. మరోసారి ఇప్పుడు ఆర్టీసీలో వనభోజనాలకు శ్రీకారం చుట్టడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వన భోజనాలకు హాజరైన మహిళా ఉద్యోగులు

ఉద్యోగుల్లో స్నేహపూర్వక వాతావరణం..

ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో 2,300 మంది రెగ్యులర్ ఉద్యోగులు, మరో 300 మంది వరకు ఔట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో కొత్తగూడెం డిపో పరిధిలో 381 మంది, భద్రాచలంలో 459, మణుగూరులో 318, ఇల్లెందులో 102, ఖమ్మంలో 600, మధిరలో 350, సత్తుపల్లి డిపోలో 450 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఖమ్మం రీజియన్ పరిధిలోని అన్ని డిపోల్లో వనభోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఇతర సిబ్బంది అందరూ పాల్గొంటుండటంతో విధుల్లో ఎదురవుతున్న సాధక బాధకాలను చర్చించుకుంటున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఉల్లాసం కోసం ఆటలు ఆడిస్తున్నారు. అందరూ ఒకేచోట చేరి భోజనాలు చేస్తుండటంతో కుటుంబంలా కలిసిపోయి స్నేహపూర్వక వాతావరణం నెలకొంటోందని అధికారులు చెబుతున్నారు.


ఉద్యోగుల్లో ఉత్సాహం..



ఎప్పుడూ డ్యూటీల పని భారంతో సతమతమవుతున్న సిబ్బందికి వన భోజనాలు ఏర్పాటు చేయడం సంతోషం. అధికారులు, సిబ్బంది అందరూ కలిసిపోతున్నారు. మహిళలకు ప్రత్యేకంగా ఆటల పోటీలు నిర్వహించారు. ఆర్టీసీ సిబ్బందిలో ఉల్లాసంతో పాటు కొంత ఉత్సాహాన్ని నింపినట్లైంది.

– శ్రీనివాసరావు, కండక్టర్, కొత్తగూడెం

అన్ని డిపోల పరిధిలో...



అన్ని డిపోల్లో వన భోజనాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఇప్పటికే ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, మధిర డిపోల పరిధిలో పూర్తిచేశాం. మిగిలిన డిపోల్లో కూడా ఈ నెల 10లోపు ఏర్పాటు చేస్తాం. వన భోజనాలతో అధికారులు, సిబ్బందితో మమేకమవుతున్నారు. ఇది ఆర్టీసీలో మంచి పరిణామం.

– సీహెచ్.వెంకన్న, ఖమ్మం రీజినల్ మేనేజర్

క్లుప్తంగా

హోటల్ నిర్వహణపై శిక్షణ


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, హోటల్ యజమానులు

భద్రాచలంఅర్బన్: ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సారథ్యంలో శుక్రవారం ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్, సర్టిఫికెట్ ప్రోగ్రాంను భద్రాచలం పట్టణంలోని ఆహా రెస్టారెంట్లో నిర్వహించారు. పట్టణంలోని హోటల్ యజమానులకు, సిబ్బందికి శిక్షణతో పాటు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి, ఫుడ్ సేఫ్టీ అధికారి కిరణ్‌కుమార్, ఎఫ్ఎస్ఎస్ఏఐ ట్రైనింగ్ భాగస్వామి చాగంటి ఆంజనేయులు, కృష్ణారెడ్డి, కల్కి వాసు, రాజు, వాసు, రాము, కోటేశ్, వెంకటరెడ్డి, హనుమంతు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగి మృతికి ఎమ్మెల్యే నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: పట్టణంలోని 2వ వార్డు ఇల్లెందులపాడు నివాసి, ఎస్బీఐ క్యాషియర్ బోషాల రమేశ్ అనారోగ్యంతో మృతి చెందిన సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు వారా రవి, అంకెపాక నవీన్, కటకం పద్మావతి, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు డానియేల్, పులి సైదులు, పింగళి నరేశ్ తదితరులు ఉన్నారు.

భూ వివాదంలో ఒకరిపై కేసు

అశ్వారావుపేటరూరల్: భూ వివాదం నేపథ్యంలో ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని జమ్మిగూడేనికి చెందిన ఆళ్ల వెంకటేశ్వరరావు, పెన్నాడ రామకృష్ణ మధ్య కొన్నేళ్లుగా వ్యవసాయ భూమికి సంబంధించిన వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం రామకృష్ణ.. వెంకటేశ్వరరావు నివాసం ఉండే ఇంటికి తాళం వేసి, ఈ ఇల్లు తనదేనంటూ ఖాళీ చేయా లని డిమాండ్ చేశాడు. ఇంట్లో ఉన్న విలువైన ల్యాప్‌ట్యాప్‌ను తీసుకెళ్లినట్లు బాధితుడు ఆళ్ల వెంకటేశ్వరరావు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీంతో రామకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐదుగురిపై కేసు..

పాల్వంచరూరల్: వరకట్నం కోసం భర్త, అత్తమామలు, మరుదులు వేధిస్తున్నారని ఓ వివాహిత ఫిర్యాదు మేరకు పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన కోటేరు ఇందుకు.. చర్ల గ్రామానికి చెందిన సంజీవరెడ్డితో ఆరేళ్ల కిందట వివాహమైంది. రెండేళ్లుగా అదనపు కట్నం కోసం భర్త, కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని ఇందు శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్త సంజీవరెడ్డితోపాటు అత్త పాపాయమ్మ, మామ సత్యనారాయణరెడ్డి, మరుదులు చంద్రశేఖర్‌రెడ్డి, సమరసింహారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

డీజే వివాదంలో..

పాల్వంచరూరల్: పెళ్లి చేసుకుని ఇంటికి వెళ్తుండగా ఏర్పాటు చేసిన డీజే విషయంలో వివాదం చెలరేగింది. దీంతో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని సూరారం గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద పెళ్లి జంటను ఊరేగిస్తున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య వివాదం తలెత్తింది. దీంతో పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని బానోత్ సాయికుమార్, శ్రీను, కుమార్, మంగమ్మ, సక్కుబాయి, ధనశ్రీ తన తండ్రి హున్సేన్‌పై దాడి చేసేందుకు యత్నించారని, పరుష పదజాలంతో దూషించారని అతడి కుమారుడు ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ రాములు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సత్తుపల్లి టౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. అన్నపురెడ్డిపల్లికి చెందిన నాగళ్ల దుర్గారావు(27) గురువారం రాత్రి సత్తుపల్లికి వచ్చి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. సత్తుపల్లిలోని కాకర్లపల్లి రోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు ఢీకొనడంతో దుర్గారావు తీవ్రంగా గాయపడగా సత్తుపల్లిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆయన సోదరుడు నగేష్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,448

అందని రైతుబంధు

నత్తనడకన పెట్టుబడి సాయం జమ

- ఎకరం భూమి ఉన్న రైతుల్లోనూ అందరికీ అందని వైనం
- ఉమ్మడి జిల్లాలో 3.30లక్షల మందికి పైగా రైతుల ఎదురుచూపులు
- ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్న యాసంగి సాగు
- పెట్టుబడికి కాసులు లేక అన్నదాతల పాట్లు


వరినాట్లు వేస్తున్న కూలీలు (ఇన్‌సెట్) సాగులో ఉన్న మొక్కజొన్న



ఖమ్మంవ్యవసాయం: యాసంగి రైతుబంధు పథకం నత్తనడకన సాగుతోంది. పంటల సీజన్ జోరందుకుంటున్న వేళ పెట్టుబడి సాయం కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. గతనెల 12 నుంచి ప్రభుత్వం యాసంగి రైతుబంధు పథకాన్ని ప్రారంభించింది. గతంలో మాదిరిగానే తక్కువ భూమి కలిగిన రైతుల ఖాతాల్లో తొలుత నగదును జమ చేసే ప్రక్రియ మొదలుపెట్టగా... 25 రోజులు గడిచినా ఎకరం భూమి కలిగిన రైతులకు కూడా పూర్తి స్థాయిలో నగదు జమ కాలేదు. దీంతో ఉమ్మడి జిల్లాలోని లక్షలాది మంది అర్హులైన రైతులు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ సాయం సమయానికి అందితే పెట్టుబడికి ఇబ్బందులు తగ్గుతాయని వారు చెబుతున్నారు.

మూడో వంతు కూడా అందలే...

యాసంగి రైతుబంధు పథకానికి అర్హుల్లో మూడో వంతు మంది రైతులకు కూడా నగదు జమ కాలేదు. ఖమ్మం జిల్లాలో 3.42 లక్షల మంది రైతులు అర్హులు కాగా వీరిలో 1.30 లక్షల మందికి, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 1.78 లక్షల మందికి గాను కేవలం 50 వేల మందికే నగదు అందింది. ఇంకా ఖమ్మం జిల్లాలో 2.10 లక్షలకు పైగా, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 1.25 లక్షల మంది అన్నదాతలు యాసంగి రైతుబంధు కోసం ఎదురు చూస్తున్నారు.

ఆది నుంచి ప్రతిబంధకాలే...

రైతుబంధుకు ఈ సీజన్‌లో అన్నీ ప్రతిబంధకాలే ఎదరవుతున్నాయి. శాసనసభ ఎన్నికల నవంబర్ 30న జరగగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో సాయానికి బ్రేక్ పడింది. అయితే, రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చినట్లే ఇచ్చి ఉపసంహరించుకుంది. ఇంతలోనూ ఎన్నికలు జరగడం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా... పాత పద్ధతిలోనే రైతుబంధు నగదు జమ చేయాలని ఆదేశించింది. దీంతో యంత్రాంగం డిసెంబర్ 12నుంచి ప్రారంభించినా ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు.

సీజన్ ప్రారంభమై రెండు నెలలు

యాసంగి పంటల సీజన్ ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తోంది. రెండు జిల్లాల్లో నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే వరి నార్లు పోయగా, కొన్నిచోట్ల నాట్లు కూడా వేస్తున్నారు. అలాగే, మొక్కజొన్న, వరి, పెసర, నవ్వులు వంటి పంటలతో పాటు ఉద్యాన పంటలు, కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం ఎకరాకు అందించాల్సిన రూ. 5 వేల సాయం జమ కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. పంటల సాగు సమయాన నగదు అందితే ప్రయోజకరంగా ఉంటుందని, లేకపోతే మళ్లీ వడ్డీ వ్యాపారులు దోచుకునే అవకాశముందని వాపోతున్నారు.

దాదాపు ఎకరం వారికే జమ

తక్కువ భూమి నుంచి ఎక్కువ భూమి కలిగిన రైతులకు ప్రాధాన్యత క్రమంలో రైతుబంధు నగదు జమ చేయడం ఆనవాయితీగా వస్తోంది. అదే ప్రకారం పథకాన్ని ప్రస్తుత సీజన్‌లో మొదలుపెట్టినా నత్తనడకన సాగుతోంది. ఖమ్మం జిల్లాలో ఎకరం భూమి కలిగిన రైతులు 1.20 లక్షల మంది, భద్రాద్రి జిల్లాలో 41,308 మంది ఉన్నారు. అయితే, రెండు జిల్లాల్లోనూ ఎకరం, ఆపైన కాస్త భూమికి కలిగిన వారికి మాత్రమే ఇప్పటివరకు నగదు అందగా మిగతా వారంతా తరచుగా బ్యాంకులకు వెళ్లి ఆరా తీస్తున్నారు. అయితే, ఎకరం లోపు భూమి కలిగిన పలువురికీ నగదు అందలేదని ఆవేదన చెందుతున్నారు.

యాసంగి 'రైతుబంధు' వివరాలు

	ఖమ్మం జిల్లా	భద్రాద్రి జిల్లా
అర్హులైన రైతులు	3,42,799	1,78,303
మంజూరైన నిధులు	రూ.370.29 కోట్లు	రూ.268.38 కోట్లు
నగదు జమ అయిన రైతుల సంఖ్య	1,30,500	50,132
జమ అయిన నగదు	రూ.41.72 కోట్లు	రూ.20.13 కోట్లు

ఎదురు చూస్తున్నాం..



నాకు రెండెకరాల భూమి ఉండగా ఇంకొంత కౌలుకు తీసుకున్నా. ఖరీఫ్‌లో పత్తితో నష్టం రాగా ఇప్పుడు మొక్కజొన్న వేస్తున్నాం. కానీ పెట్టుబడి సాయం అందుతుందని చూస్తుంటే నెల రోజుల నుంచి అదిగో, ఇదిగో అంటున్నారు.
– షేక్ హుస్సేన్ సాహెబ్, వల్లాపురం, ముదిగొండ మండలం

కొద్ది భూమికీ రాలేదు..



సొంత భూమి 38 గుంటలు మాత్రమే ఉంది. అయినా రైతుబంధు జమ కాలేదు. ఎకరం లోపు భూమి కలిగిన రైతులందరికీ వచ్చి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. బ్యాంకు వెళ్తే మాత్రమే రాలేదని అధికారులు చెప్పారు.
– కారంగుల కోటేశ్వరరావు, గోవిందాపురం, బోనకల్ మండలం

నగదు జమ కొనసాగుతోంది..



యాసంగి సీజన్‌కు పెట్టుబడి సాయం జమ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఎకరాకు రూ.5వేల చొప్పున నేరుగా రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ అవుతోంది. ఎకరం భూమి కలిగిన రైతులందరికీ పెట్టుబడి సాయం అంది ఉంటుంది.
– ఎం.విజయనిర్మల, జిల్లా వ్యవసాయాధికారి

ఉచిత విద్యుత్‌కు దూరంగా..

- జిల్లాలో 40,282 మంది ఎస్సీ, ఎస్టీలు
- కులధ్రువీకరణ పత్రాలు అందించాలని విద్యుత్ శాఖ సూచన



సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు తమ కుల ధ్రువీకరణ పత్రాలను సంబంధిత విద్యుత్ అధికారులకు అందజేసి ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత విద్యుత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ సూచిస్తోంది. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు మొత్తం 91,207 మంది ఉన్నారు. వీరిలో ఎస్సీలు 19,185 మంది, ఎస్టీలు 72,022 మంది ఉన్నారు. కాగా 51,227 మంది కుల ధ్రువీకరణ పత్రాలు అందజేసి 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను పొందుతున్నారు. వీరిలో 8,367 మంది ఎస్సీలు, 42,860 మంది ఎస్టీలు ఉన్నారు. ఇంకా ధ్రువీకరణ పత్రాలు అందజేయనివారు 40,382 మంది ఉన్నారు. వారిలో 8,866 మంది ఎస్సీలు, 31,516 మంది ఎస్టీలు ఉన్నారు. కొత్తగూడెం డివిజన్‌లో 22,934 మంది, భద్రాచలం డివిజన్‌లో 17,448 మంది ఎస్సీ, ఎస్టీలు ఇంకా ధృవీకరణ పత్రాలు అందజేయాల్సింది.

ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి



ఇప్పటివరకు ధ్రువీకరణ పత్రాలు అందజేయని ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు జిరాక్స్ కాపీలను అందజేసి రాయితీ పొందాలి. విద్యుత్ బిల్లుతోపాటు సంబంధిత ఏఈ, లైన్‌మెన్, ఏఈ కార్యాలయాల్లో, విద్యుత్ బిల్లు చెల్లించే కేంద్రాల్లో ధ్రువీకరణ పత్రాలు అందించాలి. – కె.రమేష్, విద్యుత్ ఎస్ఈ

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

పినపాక: మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బూర్గంపాడు మండలం అంజనాపురం గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అంజనాపురం గ్రామానికి చెందిన తేజావత్ శ్రీను (38) కొంతకాలంగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్నో వైద్యశాలల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో మనస్తాపానికి గురై గురువారం రాత్రి సమయంలో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు భద్రాచలంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తండ్రి గోవింద్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళ ఆత్మహత్య

ములకలపల్లి: మతిస్థిమితం సరిగా లేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తిమ్మంపేట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిమ్మంపేట గ్రామానికి చెందిన ఉయ్యాల శ్రీను వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. ఆయన భార్య మంగ (36) కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో తరచూ భర్తతో గొడవపడుతోంది. ఈ క్రమంలో కూలీ పనికి వెళ్లాలని భర్త శ్రీను మందలించడంతో మనస్తాపానికి గురైన మంగ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగింది. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వారు వచ్చి ఆమెను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పొందుతూ మంగ మృతి చెందింది. మృతురాలి భర్త శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజమౌళి తెలిపారు.

ఇసుక లారీ సీజ్

భద్రాచలంఅర్బన్: పట్టణంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఓ లారీని శుక్రవారం టౌన్ పోలీసులు సీజ్ చేశారు. భద్రాచలం సరిహద్దున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుండాల వద్ద ఉన్న ఇసుక ర్యాంప్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టణంలోని చర్ల రోడ్డులో పోలీసులు లారీని పట్టుకున్నారు. అనంతరం లారీని తహసీల్దార్‌కు అప్పగించామని, ఇసుక అక్రమ రావాణా చేస్తున్న కారణంగా లారీ ఓనర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగరాజురెడ్డి తెలిపారు.

ములకలపల్లి మండలంలో ఇసుక ట్రాక్టర్లు..

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. మండలంలోని గుర్రాలకుంట శివారులో ఇసుక తరలిస్తున్నట్లు స్థానిక పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు దాడులు నిర్వహించి, రెండు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజమౌళి తెలిపారు.

చెరువులో మత్స్యకారుడి గల్లంతు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరంలోని కొత్తగూడెం చెరువులో కాపలా కోసం వెళ్లిన మత్స్యకారుడు పిట్టల కనకయ్య గల్లంతయ్యాడు. నలుగురు మత్స్యకారులు గురువారం రాత్రి చెరువు వద్దకు కాపలా వెళ్లారు. ఇందులో కనకయ్యతో పాటు మరొకరు పడవపై చెరువు మధ్యలో కాపలా కాస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో పడిన కనకయ్య గల్లంతయ్యాడు. దీంతో ఆయన కోసం గాలింపు చేపట్టగా శుక్రవారం రాత్రి వరకు ఆచూకీ తెలియరాలేదు.

ఎంఈఓ కార్యాలయంలో పాము కలకలం


పామును చూపిస్తున్న వృద్ధుడు

టేకులపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎంఈఓ కార్యాలయం పాములకు నిలయంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. శుక్రవారం కార్యాలయంలోకి పది అడుగుల పాము రావడంతో భయభ్రాంతులకు గురైన మెసెంజర్ భాస్కర్ బయటకు పరుగులు తీశాడు. చుట్టుపక్కల వారు వచ్చి చాకచక్యంగా పాముని హతమార్చారు. పురాతన భవనం కావడం, దీని చుట్టూ పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం ఉండటం, బురద మడుగులు ఉండటంతో తరచూ పాములు వస్తున్నాయని, ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


దేవరం మృతదేహం

అశ్వాపురం: అశ్వాపురం మండలం కల్యాణపురంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కల్యాణపురానికి చెందిన గుమ్మడి దేవరం (58) ప్రధాన రహదారి దాటుతుండగా మణుగూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు అమృతరావు ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎంపీపీ ముత్తినేని సుజాత దేవరం మృతదేహం వద్ద నివాళులర్పించారు.

ఆలయానికి వెళ్తూ..

పాల్వంచరూరల్: మొక్కు తీర్చుకునేందుకు కాలినడకన వెళ్తున్న వృద్ధుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన జగన్నాథపురం సమీపంలో చోటుచేసుకుంది. గార్ల మండలం కొత్తపోచారం గ్రామానికి చెందిన మావీడు అంజయ్య (53) భద్రాచలంలోని సీతారామచంద్రస్వామిని దర్శించుకునేందుకు ఈ నెల 3వ తేదీన కాలినడకన బయలుదేరాడు. మండలంలోని జగన్నాథపురం బీసీయం జాతీయ రహదారిపై నడుస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి అల్లుడు రవీంద్రబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

గుండెపోటుతో ఇంటర్ విద్యార్థి మృతి


నర్సింహారావు (ఫైల్)

చర్ల: గుండెపోటుతో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి మృతిచెందిన ఘటన గురువారం అర్ధరాత్రి చర్ల మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని తేగడ గ్రామానిక చెందిన జుమ్ముల మురళి – దేవి దంపతుల రెండో కుమారుడు జుమ్ముల నర్సింహారావు (16) చర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రిస్తున్న సందర్భంలో ఒక్కసారిగా లేచి గుండెలో నొప్పి వస్తోందంటూ కుప్పకూలాడు. వైద్యశాలకు తరలించేలోపే నర్సింహారావు మృతి చెందాడు. గుండెపోటు కారణంగానే మృతి చెందాడంటూ కుటుంబ సభ్యులు బోరున విలపించారు. విద్యార్థి మృతికి చర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సంతాపం తెలిపారు.

కూలిన ఇంటి గోడ

భద్రాచలంఅర్బన్: పట్టణంలో తహసీల్దార్ నివాసం ఉండే ఇంటి గోడ కూలింది. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. అయితే, గోడ పక్కనే ఓ రిక్షా ఉండటంతో అది పూర్తిగా ధ్వంసమైంది. అధికారులు స్పందించి తనకు నష్ట పరిహారం ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సదరు రిక్షా కూలీ కోరుతున్నాడు.

ముగిసిన రామయ్య విలాసోత్సవాలు

చివరి రోజు వశిష్ఠ మండపంలో వేడుకలు


వశిష్ఠ మండపంలో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో స్వామివారి విలాసోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు దేవస్థానం సిబ్బంది ఆధ్వర్యంలో వశిష్ఠ మండపంలో విలాసోత్సవాన్ని వైభవోపేతంగా జరిపారు. తొలుత ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారిని పల్లకీ సేవగా మంగళవాయిద్యాలు, భక్తుల శ్రీరామనామస్మరణలు, కోలాటాల నడుమ మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి సమర్పించారు. కాగా శ్రీమద్ ఉత్తరాది మఠంవారు ప్రత్యేకంగా తయారు చేయించిన స్వామి వారి రాజఖడ్గాన్ని శనివారం దేవస్థానం అధికారులకు అందచేయనున్నారు. సోమవారం స్వామివారికి బేడా మండపంలో విశ్వరూప సేవ నిర్వహించనున్నారు.

సుదర్శన హోమం..

దేవస్థానం ప్రాంగణంలోని యాగశాలలో చిత్తా నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం, ప్రత్యేక పూజలు జరిపారు. అంతరాలయంలో మూలమూర్తులను స్వర్ణకవచాలతో అలంకరించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

ప్రజల విశ్వాసానికి అనుగుణంగా పథకాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి: పండుగ వాతావరణంలో ప్రజాపాలన గ్రామ, వార్డు సభలు జరుగుతున్నాయని, ఈ సభల్లో గ్యారెంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకుంటున్న ప్రజల నమ్మకానికి అనుగుణంగా పథకాలు అందజేస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజాపాలన గ్రామసభల్లో భాగంగా శుక్రవారం చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ గ్రామపంచాయతీలో జరిగిన సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేస్తుందనే నమ్మకంతోనే ప్రజలు అధికారం అందించారని, ఆ నమ్మకానికి అనుగుణంగా ఏ ఒక్క కుటుంబానికి అన్యాయం చేయొద్దని, ప్రతి దరఖాస్తుపై ప్రత్యేక దృష్టి సారించి పథకం అందేలా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్కే సాబీర్‌పాషా, సులోచన, కృష్ణ, సత్యనారాయణ, బానోత్ గోవిందు, బాబూరావు, పెద్దన్నకుమార్, ప్రవీణ్‌కుమార్, వాసిరెడ్డి మురళి, కృష్ణ, శ్రీనివాస్, యాంత్ర మహేశ్, రంగారావు, నిఖిల్ పాల్గొన్నారు.

పాల్వంచ రూపురేఖలు మారుస్తా..

పాల్వంచ: నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని, పాల్వంచ రూపురేఖలు మార్చి చూపిస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలోని సీతారాంపట్నంలో జరిగిన ప్రజాపాలన వార్డ్ సభను సందర్శించి మాట్లాడారు. పేదలకు గ్యారెంటీ పథకాలు అందించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఎ.స్వామి, డి.మురళి, లక్ష్మణ్, రాము, రాఘవయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలి

సింగరేణి(కొత్తగూడెం): పండుగ వాతావరణంలో ప్రజాపాలన సభలు జరుగుతున్నాయని, ఈ సభల్లో దరఖాస్తు చేసుకున్న వారికి సంక్షేమ పథకాలు అమలుచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పంజాబ్ గడ్డ 8వ వార్డు తదితర ప్రాంతాల్లో జరిగిన వార్డుసభలను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామసభ ప్రత్యేక అధికారి సులోచన, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రఘు, సర్పంచ్ బానోత్ గోవిందు, 8వ వార్డు కౌన్సిలర్ కంచర్ల జమలయ్యతదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల వేతనాలు ఇప్పించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి రెండు నెలలుగా వేతనాలు విడుదల కాలేదని, వెంటనే విడుదలయ్యే విధంగా చూడాలని కోరుతూ శుక్రవారం అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జిలు ధరించి డీఈఓ వెంకటేశ్వరచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది మాట్లాడారు. జిల్లా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న 620 మంది సిబ్బందికి రెండు నెలలుగా వేతనాలు రాకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. చాలీచాలని వేతనంతో మండలాల్లో పనిచేస్తున్న సీఆర్‌పీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కేజీబీవీల్లోని సీఆర్‌టీ, పీజీసీఆర్‌టీలు, యూఆర్‌లోని సిబ్బంది, భవిత కేంద్రాల్లోని ఐఈఆర్‌పీలు, ఆయాలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న సెక్టోరల్ అధికారులు, కార్యాలయ రెగ్యులర్ సిబ్బందికి కూడా వేతనాలు నిలిచిపోయాయని వివరించారు. వినతిపత్రం అందించినవారిలో జిల్లా సెక్టోరల్ అధికారులు ఎస్కే సైదులు, జె.అన్నామని, ఎన్.సతీశ్‌కుమార్, సూపరింటెండెంట్, వి.జ్యోతి, కె.జ్యోతి, సమగ్ర శిక్ష జేఏసీ అధ్యక్షులు బి.మోహన్, దుర్గాప్రసాద్, ఎం.సంధ్యారాణి, శ్రీనివాస్, సురేశ్, రఫియా, రాజేశ్, వెంకట్ న్నారు.

ఆయుష్మాన్ భారత్‌లో ఆంధ్రప్రదేశ్ టాప్

- పదో స్థానంలో తెలంగాణ
- రాజ్యసభ స్థాయీ సంఘం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: 'ఆయుష్మాన్ భారత్'లో భాగంగా పేదల ఆరోగ్యానికి చేస్తున్న ఖర్చులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే టాప్‌లో ఉందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఒక నివేదిక కూడా విడుదల చేసింది. 2022–23లో ఏపీ ప్రభుత్వం రూ.3,338 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొంది. రూ.2,623 కోట్లతో గుజరాత్ రెండోస్థానంలో, రూ.1,932 కోట్లతో మధ్యప్రదేశ్ మూడోస్థానంలో, రూ.1,724 కోట్లు ఖర్చు చేసి రాజస్తాన్ నాలుగోస్థానంలో ఉంది. రూ.1,155 కోట్లతో తెలంగాణ ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఏటా ఏపీలో ఆయుష్మాన్‌భారత్ పథకం కింద చేస్తున్న ఖర్చు పెరుగుతోంది. 2018–19లో రూ.415.94 కోట్లు, 2019–20లో రూ.1,409 కోట్లు, 2020–21లో రూ. 1,908 కోట్లు, 2021–22లో రూ.2,715 కోట్లు ఖర్చు చేసినట్టు ఆ నివేదిక పేర్కొంది. ఏపీలో 2022–23లో 15.42 లక్షలమంది లబ్ధిదారులుగా ఉన్నారు. లబ్ధిదారులపరంగా ఏపీ దేశంలో మూడోస్థానంలో ఉంది. 23.13 లక్షలతో కర్ణాటక మొదటిస్థానంలో ఉంది. రెండో స్థానంలో ఉన్న రాజస్తాన్‌లో 16.40 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. తెలంగాణ 5.59 లక్షల మందితో 10వ స్థానంలో ఉంది.

ఏ ఆరోగ్యబీమా లేనివారు 30 శాతం

దేశంలో ఏ ఆరోగ్యబీమా అందనివారు 30 శాతం ఉన్నారు. వారంతా మధ్యతరగతి ప్రజలేనని రాజ్యసభ ఆరోగ్యస్థాయీ సంఘం నివేదిక తెలిపింది. 51 శాతం మంది ప్రభుత్వ పథకాలతో నేరుగా ఆరోగ్య బీమా అందుకుంటున్నారు. 10 శాతం మంది సామాజిక ఆరోగ్య బీమా పథకాలు అంటే ప్రభుత్వ ఉద్యోగులు, ఈఎస్ఐ ద్వారా లబ్ధిపొందే కార్మికులు ఉన్నారు. 9 శాతం మంది ప్రైవేట్ ఆరోగ్య బీమా పథకాల్లో ఉన్నారు. ఆయుష్మాన్ భారత్‌ను ఒకట్రెండు మినహా అన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. ఇప్పటికే 23 రాష్ట్రాల్లో ఏదో ఒక స్థానిక ఆరోగ్య పథకాలున్నాయి. వాటిని ఆయుష్మాన్ భారత్‌తో కలిపి చేస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ కింద అయ్యే ఖర్చులో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది.

ఆరోగ్య ఖర్చుల ద్రవ్యోల్బణం 14 శాతం

దేశంలో ఆరోగ్య ఖర్చుల ద్రవ్యోల్బణం ఏటా 14 శాతం. ఇది ప్రపంచంలోనే ఎక్కువ. ప్రభుత్వం ఆరోగ్యంపై పెట్టే ఖర్చు జీడీపీలో రెండు శాతమే. ఇది ప్రపంచంలోనే అత్యల్పం. ప్రపంచసగటు 10 శాతంగా ఉంది. అందరికీ ఆరోగ్యబీమా అందజేయాలంటే ప్రభుత్వ కేటాయింపులు పెంచాలి. ప్రభుత్వ బీమా పథకాల్లో ప్రైవేట్ ఆస్పత్రుల భాగస్వామ్యం పెంచాలి. ఇది జరగాలంటే కవరయ్యే వ్యాధుల సంఖ్య పెంచి ప్యాకేజీ రేట్లు కూడా ఎప్పటికప్పుడు సవరించాలి. అప్పుడు పేద రోగులకు ప్రయోజనం కలుగుతుంది.

– డాక్టర్ కిరణ్ మాదల,
ఐఎంఏ సైంటిఫిక్ కన్వీనర్, తెలంగాణ

నారా దారి.. అడ్డదారి

ఊతకర్రల సాయంతో చంద్రబాబు దింపుడుకళ్లెం ఆశలు


ఎన్నికల వేళ జగన్‌ను ఎదుర్కోవటానికి కుట్రలు కొత్త పుంతలు

- అన్ని పార్టీలూ తన అవసరాల కోసమే మోహరింపు.. కాంగ్రెస్, బీజేపీని తన మనుషుల ద్వారా నడిపిస్తున్న వైనం
- అవసరమైనప్పుడల్లా పార్టీలకు ఇం'ధనం'.. ప్రత్యేక విమానాల సేవలు
- శిష్యుడు రేవంత్ సహా తెలంగాణ నేతల అందరినీ కాంగ్రెస్ గూటికి చేర్చిన బాబు
- ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచాక సీఎం పీఠంపై కూర్చోవడానికీ సహకారం..

నిజం చెప్పడు... నేరుగా పోరాడడు.. అవకాశవాదమే కాదు అలవోకగా అబద్ధాలాడేసే నైజం. ఇచ్చిన మాటంటే లెక్కే ఉండదు. ఏరు దాటాక తెప్పని బూడిద చేసి నీట్లో కలిపేసే రకం. అధికారం కోసం దేనికైనా రెడీ. శత్రువుల కాళ్లు పట్టుకోవటానికైనా... మిత్రుల కాళ్లు నరికేయడానికైనా...!! ఎంతసేపూ... తనకు ఎవరు, ఎలా ఉపయోగపడతారనే యావే. బహుశా! ఆధునిక రాజకీయాల్లో నారా చంద్రబాబు నాయుడి లాంటి నాయకుడెవరినీ చూడలేం. పురాణాల్లోనూ ఇలాంటి పాత్ర కనిపించదు. ఎందుకంటే వాటిలోని పాత్రల లక్షణం ఒక్కటీ ఈయనలో ఉండదు. ఈయనకున్న అవ లక్షణాలు పురాణాల్లోని ఏ ప్రతినాయకుడికీ ఉండవు. కానీ చంద్రబాబులోని ఈ అవలక్షణాలన్నిటికీ విజన్... చాణక్యం... వ్యూహ చాతుర్యం.. దార్శనికత.. అనే అందమైన ముసుగులేసి ఆయనో ఘనమైన నాయకుడని నమ్మించింది ఓ వర్గం మీడియా. బాబు మినహా అధికారంలో ఎవరున్నా... ఈ రాష్ట్రం నాశనమైపోతోంది.. దివాలా తీసేసింది... అంటూ విష ప్రచారం చేస్తుందీ మీడియా. వీళ్ల దృష్టిలో బాబు ఏం చేసినా... అది రాష్ట్ర ప్రయోజనాల కోసమే. ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా... ప్రజాస్వామ్యం కోసమే!!. ఔరా.. ఇంత దౌర్భాగ్యమా??

ఇలా నిలువెల్లా దుర్మార్గాన్ని, విషాన్ని నింపేసుకున్న 63 కిలోల.. 73 ఏళ్ల చంద్రబాబు సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోవటానికి కుతంత్రాలను కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. ప్రజాబలం లేక ఓటమి తరుముకొస్తుండటంతో వాటిని పతాక స్థాయికి చేరుస్తున్నారు. ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన సీఎం జగన్‌ను తను, తన పార్టీ ఏమీ చేయలేమని తెలుసు గనక జనసేన, సీపీఐ, సీపీఎం లాంటి పార్టీలన్నిటినీ కూడగడుతున్నారు. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ కూడా... తనకు అనుకూలంగానే పనిచేసేలా వాటిలోని తన మనుషుల ద్వారా ఆపరేట్ చేస్తున్నారు. 2019లో చంద్రబాబు ఓడిపోగానే ఆయన ఆదేశాల మేరకు బీజేపీలోకి ఫిరాయించిన సి.ఎం.రమేశ్, సుజనా చౌదరి ఇప్పటిదాకా బాబు–బీజేపీలను కలపటానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. సి.ఎం.రమేశ్ ఓవైపు ఆ పని చేస్తూనే మరోవైపు బీటెక్ రవిని రంగంలోకి దించడంతోపాటు వైఎస్ షర్మిలకు ప్రత్యేక విమానాలు సమకూర్చి సేవలందిస్తున్నారు. చంద్రబాబు కాంగ్రెస్‌లోకి పంపిన రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కావటంతో టీడీపీ–కాంగ్రెస్ సంబంధాలు మరింత బలపడ్డాయి. నిజానికి కాంగ్రెస్ పార్టీ ద్వారా వైఎస్ జగన్‌పై అక్రమ కేసులు బనాయించిన నాటి నుంచి హస్తంతో చంద్రబాబు అక్రమ బంధం కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు కాంగ్రెస్ వ్యూహకర్తగా తన సామాజిక వర్గానికే చెందిన సునీల్‌ను నియమించి తెరచాటున పనులు చక్కబెడుతున్నారు. చంద్రబాబు ఎవరెవరిని ఎలా వాడుకుంటున్నారో ఒక్కసారి చూద్దాం...

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటం, గత ఎన్నికలకు మించి ఘోర పరాజయం గోచరిస్తుండటంతో టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అధికారంపై దింపుడు కళ్లం ఆశలతో అరాచకత్వానికి పాల్పడుతున్నారు. గత ఎన్నికల్లో అధికారాన్ని కాపాడుకునేందుకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌తో విడిగా పోటీ చేయించిన చంద్రబాబు ఇప్పుడు అధికారం కోసం అర్రులు చాస్తూ జనసేనతో జత కలిశారు. తెలంగాణలో 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని ఆపార్టీకి ఇం'ధనం'సమకూర్చిన చంద్రబాబు ఆ ఎన్నికల్లో ఓడిపోయాక అక్కడ టీడీపీ నేతలందరినీ 'హస్త'గతం చేశారు. రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత తనకు అత్యంత సన్నిహితులైన రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్, సుజనా చౌదరి లాంటి వారిని బీజేపీలోకి పంపి అవినీతి కేసుల నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్నారు. సీఎం రమేష్ ద్వారా ప్రత్యేక విమానాలను సమకూరుస్తూ కుట్రలకు పదును పెట్టారు. తన శిష్యుడైన రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి పంపి నోట్ల కట్టలు వెదజల్లి పీసీసీ అధ్యక్ష పదవి కట్టబెట్టేలా చేసిన చంద్రబాబు ఇటీవల తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాక మరోసారి ఇం'ధనం'సమకూర్చి సీఎం పీఠంపై కూర్చోవడానికి సహకరించారు. కాంగ్రెస్‌కు వ్యూహకర్తగా పని చేస్తున్న సునీల్ కనుగోలు చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం గమనార్హం. చంద్రబాబు చెప్పినట్లు ఆడేందుకు, బాబు ప్లాన్‌ను అమలు చేసేందుకు ఆయన సదా సిద్ధంగా ఉంటారు.



పరాకాష్టకు కుట్రలు, కుతంత్రాలు..

సంక్షేమాభివృద్ధి పథకాలు, విప్లవాత్మక సంస్కరణలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఆదరణ రోజుకు రోజుకు పెరుగుతోందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 25కు 25 లోక్‌సభ స్థానాల్లో ఆపార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని టైమ్స్ నౌ లాంటి జాతీయ మీడియా సంస్థల సర్వేల్లో వెల్లడైంది. ప్రజల విశ్వాసాన్ని చంద్రబాబు పూర్తిగా కోల్పోవడంతో టీడీపీ ఉనికి కూడా చాటుకోలేదని ఆ సర్వేలు తేల్చి చెప్పాయి. గత ఎన్నికల కంటే ఘోర పరాజయం తప్పదని పసిగట్టిన చంద్రబాబు అడ్డదారి పట్టారు. అనాదిగా మైనార్టీలు కాంగ్రెస్ వెనుకే ఉంటారన్న ఓ పాచిపోయిన భావనను తనకు అనుకూలంగా మార్చుకోవాలన్నది ఆయన ఎత్తుగడ. వైఎస్సార్‌సీపీలో టిక్కెట్ దక్కని వారికి తన శక్తుల ద్వారా కాంగ్రెస్ టికెట్లు ఇప్పించి ఇం'ధనం'సమకూర్చి ఎన్నికల్లో లబ్ధి పొందాలన్నది బాబు ప్లాన్. ఒకవైపు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న ఓట్లను చీల్చడం.. మరోవైపు బీజేపీ వ్యతిరేక ఓటు వైఎస్సార్‌సీపీకి దక్కకుండా చేయడం దీని వెనుకున్న మరో ఎత్తుగడ. ఇలా ఓవైపు కాంగ్రెస్‌ను తానే నడుపుతూ స్వార్థానికి వాడుకోవడమే కాకుండా.. ఇంకోవైపు బీజేపీని కూడా తన వైపు తిప్పుకుని అవినీతి కేసుల నుంచి బయట పడేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీల్లో ఉన్న తన మనుషులు, తాను సృష్టించిన పాత్రల ద్వారా ఈ ఎత్తుగడలను అమలు చేసే ప్రణాళిక వేశారు.

శిథిలమైన కాంగ్రెస్‌తో శూన్యమే..

2014లో ఇటు రాష్ట్రంలో అటు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అన్యాయంగా విభజించింది. విభజనతో పూడ్చలేని నష్టాన్ని ఆంధ్రప్రదేశ్‌కు మిగిల్చింది. తరతరాల పాటు రాష్ట్ర ప్రజానీకాన్ని కోలుకోనివ్వకుండా దెబ్బ తీసింది. ఏపీకి తీరని అన్యాయం చేసింది కాబట్టే కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో ప్రజలు అధఃపాతాళానికి తొక్కేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 1.17 శాతం ఓట్లు లభించగా నోటాకు 1.28 శాతం ఓట్లు రావడమే అందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో శిథిలమైన కాంగ్రెస్ నుంచి చంద్రబాబు ఆశించే ప్రయోజనం ఒనగూరే అవకాశమే లేదని రాజకీయ పరిశీలకులు తేల్చి చెబుతున్నారు. హఠాన్మరణం తర్వాత కూడా మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చిన కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్రాన్ని అన్యాయంగా విభజించిన పార్టీకి ఏపీలో ఎవరు నేతృత్వం వహించినా ప్రజలు మద్దతు ఇవ్వరని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

గోదావరి చెంతన తెలుగు సభల నిర్వహణ భేష్

ఛత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

- ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ తెలుగు మహాసభలు
- తొలి రోజు మూడు వేదికలపై సందడి చేసిన కవులు, కళాకారులు



జ్యోతి ప్రజ్వలనం చేసి సభలను ప్రారంభిస్తున్న గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

సాక్షి, రాజమహేంద్రవరం: గోదావరి చెంతన సాంస్కృతిక రాజధానిగా పేరొందిన రాజమహేంద్రవరంలో రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించడం అభినందనీయమని ఛత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే అంతర్జాతీయ తెలుగు మహాసభలు ఇక్కడి గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాజరాజనరేంద్రుడి పట్టాభిషేక సహస్రాబ్ది నీరాజనంగా, ఆదికవి నన్నయ భారతాన్ని ఆంధ్రీకరించి వెయ్యేళ్లయిన సందర్భంగా ఈ సభలు నిర్వహిస్తున్నారు. రాజరాజ నరేంద్రుడు, నన్నయ భట్టారక, నారాయణభట్టు వేదికలపై నిర్వహిస్తున్న ఉత్సవాలను గవర్నర్ విశ్వభూషణ్, విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ప్రారంభించారు. గవర్నర్ విశ్వభూషణ్ మాట్లాడుతూ.. సంస్కృతి, రచనలకు కేరాఫ్ అడ్రస్‌గా రాజమహేంద్రవరం విరాజిల్లుతోందన్నారు. అలాంటి గడ్డపై తెలుగు మహాసభలు నిర్వహించడం గర్వకారణమని అన్నారు. స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ.. కావ్యాలు, పురాణేతిహాసాలను తెలుగు వాళ్లు అనువదించినట్టు ఎవరూ చేయలేదన్నారు. తెలుగులో ఎన్నో యాసలు, ప్రాసలు, ఉపభాషలు ఉన్నాయన్నారు. పోతన భాగవతం, అన్నమయ్య కీర్తనల్లోని పదాలు చూస్తే ముచ్చటేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ జాతీయ కార్యకారి వారణాసి రామ్‌మాధవ్, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కవి అందెశ్రీ, జేఎన్‌టీయూకే ఉప కులపతి జీవీఆర్ ప్రసాదరాజు, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి, పారిశ్రామికవేత్త వర్మ, అష్టావధాని బులుసు అపర్ణ పాల్గొన్నారు.

ఇదేమి వాదన?

- వివేకా హత్య కేసులో సీబీఐపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం
- శివశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అరెస్టయిన శివశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సీబీఐ న్యాయవాదిపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సరైన సమాచారం లేకుండా 'ఐ థింక్ సో'అంటూ వాదనలు వినిపించడం సరికాదని చెప్పింది. వాదనలకు వచ్చే ముందే అధికారులు, ఇతర న్యాయవాదుల నుంచి సమాచారం తీసుకుని రావాలని వ్యాఖ్యానించింది. వైఎస్ వివేకా హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని, బెయిల్ ఇవ్వాలని కోరుతూ గత నెల శివశంకర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. వివేకా హత్యతో శివశంకర్‌రెడ్డికి సంబంధంపై సీబీఐ వద్ద ఎలాంటి ఆధారాలు లేకున్నా అరెస్టు చేసిందన్నారు. సీబీఐ చెప్పినట్లు దస్తగిరి(ఏ–4) వాంగ్మూలం ఇచ్చాడని.. అందుకే అతని బెయిల్‌కు దర్యాప్తు సంస్థ పూర్తిగా సహకరించిందని తెలిపారు. అనంతరం సీబీఐ తరఫున న్యాయవాది అనిల్ తల్వార్ వాదనలు వినిపించారు. శివశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని చెప్పారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి.. తీర్పు కాపీ ఉందా అని ప్రశ్నించారు. కనీసం ఎస్ఎల్‌పీ (పిటిషన్) నంబర్ అన్నా చెప్పండి అని అడగగా.. సీబీఐ న్యాయవాది నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంపై న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. వాదనల అనంతరం తీర్పును రిజర్వ్ చేశారు.

జిల్లా వార్తలు

ఖమ్మం వాసికి డాక్టరేట్



రవికుమార్

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మానికి చెందిన దోరెపల్లి రవికుమార్‌కు హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. తాజాగా జరిగిన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో రవికుమార్ డాక్టరేట్ అందుకోగా, వ్యాయామ ఉపాధ్యాయులు పలువురు అభినందించారు.

మంత్రి తుమ్మలను కలిసిన ఇల్లెందు ఎమ్మెల్యే



మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కలిశారు. ఖమ్మంలో శుక్రవారం మంత్రిని కలిసిన ఎమ్మెల్యే సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆతర్వాత నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, కావాల్సిన నిధులపై చర్చించారు. అనంతరం ఖమ్మం కలెక్టర్ గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను కూడా ఎమ్మెల్యే కలిశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, తుపాకుల యలగొండల స్వామి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



మధులత



ఉపేందర్

బోనకల్: జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు బోనకల్ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన కె.మధులత, బి.ఉపేందర్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, కోచ్ అమిరేవి లింగయ్య తెలిపారు. వీరు మహారాష్ట్రలో జరిగే జాతీయ పోటీలలో పాల్గొననున్నారని వెల్లడించారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి టోర్నీ

- పోటీల్లో తలపడుతున్న గిరిజన విద్యార్థులు
- కిన్నెరసానిలో రెండోరోజుకు చేరిన క్రీడాపోటీలు



వాలీబాల్ ఆడుతున్న బాలురు



హైజంప్‌లో పాల్గొన్న క్రీడాకారుడు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కిన్నెరసానిలోని స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి గిరిజన పాఠశాలల క్రీడాపోటీలు శుక్రవారం రెండో రోజుకు చేరాయి. నాలుగు ఐటీడీఏల పరిధిలోని పాఠశాలల నుంచి 1,650 మంది విద్యార్థులు, 400 మందికి పైగా పీఈటీలు, పీడీలు, కోచ్‌లు హాజరయ్యారు. ఈ మేరకు కబడ్డీ, అథ్లెటిక్స్, హైజంప్, ఆర్చరీ, ఖో–ఖో, డిస్కస్ త్రో, షాట్‌పుట్ అంశాల్లో పోటీలు నిర్వహించగా విద్యార్థులు నువ్వా.. నేనా అన్నట్లు తలపడ్డారు. పోటీలను ఏసీఎంఓ టి.రమణయ్య, అధికారులు బి.గోపాల్‌రావు, ఎస్‌కే జహీరుద్దీన్, చంద్రమోహన్, పి.నర్సింహారావు, బి.రూపాదేవి పర్యవేక్షించి లీగ్ దశలో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

విజేతలు వీరే..

రాష్ట్రస్థాయి పోటీలు రెండో రోజు శుక్రవారం లీగ్ దశకు చేరాయి. ఈ సందర్భంగా ఆర్చరీ 20 మీటర్లలో కె.రాంచరణ్ (భద్రాచలం), సాత్విక్ (భద్రాచలం), 30 మీటర్లలో ఎం.హరిఓంప్రకాశ్ (ఉట్నూర్–2), రాంచరణ్(భద్రాచలం) మొదటి రెండు స్థానాలు దక్కించుకున్నారు. అండర్–17 అథ్లెటిక్స్ బాలుర విభాగం లాంగ్ జంప్‌లో ఎం.సోమ (ఉట్నూరు), కె.శంకర్ (ఉట్నూరు), ఎం.ప్రతాప్ (ఉట్నూర్–2) మొదటి మూడు స్థానాల్లో నిలవగా డిస్కస్‌త్రోలో కె.అవ్వరాజు (ఉట్నూరు), టి.అజయ్, షాట్‌పుట్‌లో ఎం.ఇంద్రసాయి (ఉట్నూరు), పి.సతీశ్‌కుమార్ (ఉట్నూరు), అండర్–17 బాలికల విభాగం డిస్కస్‌త్రోలో ఎస్.సందూరి (ఉట్నూరు), కె.మనీషా (ఉట్నూరు), అండర్–14 బాలికల విభాగంలో సీహెచ్ ప్రణవి (ఏటూరునాగారం), ఎం.అనిత(ఉట్నూరు) మొదటి రెండు స్థానాలు దక్కించుకున్నారు.

అరకొర ఏర్పాట్లతో ఇక్కట్లు

మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు నాలుగు ఐటీడీఏల పరిధి నుంచి వెయ్యి మందికి క్రీడాకారులు, పీఈటీలు కోచ్‌లు హాజరయ్యారు. అయితే, వారికి కావాల్సిన ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. క్రీడాకారులు విరామ సమయంలో సేద తీరేందుకు, పోటీలను చూసే వారి కోసం నీడనిచ్చే టెంట్లు అరకొరగానే వేశారు. అలాగే, మైదానంలో కనీసం తాగునీరు కూడా లేక క్రీడాకారులు అవస్థ పడుతున్నారు. ఈ విషయమై ఐటీడీఏ డీడీ మణెమ్మ వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.



ఆర్చరీ పోటీలో పాల్గొన్న విద్యార్థులు



ఖో–ఖో పోటీలో దూసుకెళ్తున్న బాలిక

కేంద్ర మంత్రి చొరవతో అండర్‌పాస్‌కు అనుమతి

ముదిగొండ: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవతో ముదిగొండ రైతుల సమస్య పరిష్కారమైందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం–కోదాడ జాతీయరహదారి నిర్మాణం నేపథ్యాన ముదిగొండ రైతులు తమ పొలాలకు వెళ్లేలా అండర్‌పాస్ నిర్మించాలని ఇటీవల కేంద్రమంతి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీంతో ఆయన మంత్రి నితిన్‌గడ్కరీ కార్యాలయానికి లేఖ రాశారు. ఈమేరకు జాతీయ రహదారుల శాఖ అధికారులు శుక్రవారం ముదిగొండకు చేరుకుని రైతులతో చర్చించారు. రైతుల వెసులుబాటు కోసం మీడియన్ ఓపెనింగ్ ఇవ్వనున్నట్లు వెల్లడించగా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, నితిన్‌గడ్కరీ, నేషనల్ హైవే పీడీ, అధికారులకు రైతుల పక్షాన శ్రీధర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేసి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు, రైతులు యరబోలు వేణుగోపాల్‌రెడ్డి, రావులపాటి స్వరాజ్, రావూరి రామారావు, మందరపు ఉపేందర్‌రావు, యలమద్ది శ్రీనివాసరావు, ఉన్నం వెంకయ్య, గుర్రం వెంకయ్య, బట్టు బాబు, వేగినాటి ముత్తయ్య, భద్రయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

ఐటీడీఏలో సమాచార బోర్డులు



నూతన భవనాన్ని పరిశీలిస్తున్న పీఓ ప్రతీక్, అధికారులు

భద్రాచలం: కార్యాలయానికి వచ్చే గిరిజనులు, ప్రజాప్రతినిధులకు ఏ విభాగం ఎక్కడ ఎందో తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేయాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన సమావేశ మందిరంతో పాటు రెండో అంతస్తులోని వివిధ విభాగాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్యాలయానికి వచ్చే గిరిజనులకు అవసరమైన విభాగం ఎక్కడ ఉందో తెలిసేలా బోర్డులతో పాటు అన్ని విభాగాల వివరాలతో కార్యాలయం ఎదురుగా బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. కాగా, పనికిరాని సామగ్రిని పది రోజుల్లోగా తొలగించి కార్యాలయంలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా తీర్చిదిద్దాలని పీఓ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఎస్‌ఓ సురేశ్‌బాబు, అధికారులు తానాజీ, భాస్కర్, అశోక్‌కుమార్, శ్రీనివాస్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ



క్యాలెండర్లు, డైరీని ఆవిష్కరిస్తున్న చైర్మన్, పాలకవర్గం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఆధ్వర్యాన రూపొందించిన నూతన సంవత్సరం డైరీలు, క్యాలెండర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో వీటిని చైర్మన్ కూరాకుల నాగభూషణం ఆవిష్కరించి పాలకవర్గ సభ్యులు, అధికారులకు అందజేశారు. అనంతరం ఇటీవల మృతిచెందిన డీసీసీబీ డైరెక్టర్ వేముల శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బ్యాంకు సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన ఇల్లెందు, భద్రాచలం జట్లు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న తాళ్లూరి భారతిదేవి స్మారక నెహ్రూ కప్ అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీ సెమీస్ దశకు చేరింది. ఈ మేరకు ఇల్లెందు, భద్రాచలం జట్లు సెమీ ఫైనల్స్ చేరాయని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఉదయం జరిగిన మొదటి మ్యాచ్ ఇల్లెందు వైఎంసీసీ జట్టు, పీసీసీ లెవెన్ పాల్వంచ జట్టుపై గెలుపొందింది. ఇందులో తొలుత బ్యాటింగ్ చేసిన ఇల్లెందు జట్టు 162 పరుగులు సాధించింది. అత్యధికంగా 53పరుగులు చేసిన నేహిత్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సారపాకకు చెందిన విద్యావేత్త బి.ఎన్.ఆర్ అందజేశారు. రెండో మ్యాచ్ ఆర్‌సీసీ పాల్వంచ, బెస్ట్ క్రికెట్ అకాడమీ భద్రాచలం జట్ల మధ్య జరగగా బెస్ట్ క్రికెట్ అకాడమీ జట్టు ఒక వికెట్ తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో సాయినాథ్‌కు ఐటీసీ కాంట్రాక్టర్ సత్యనారాయణ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు బహూకరించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ కప్ వ్యవస్థాపకులు తోటమల్ల బాలయోగి, ప్రధాన కార్యదర్శి మడిపల్లి నాగార్జున, కన్వీనర్ ఎస్‌కే.సలీంతోపాటు కుంచాల సదానందం, గుమ్మలూరి శ్రీనివాసరావు, బాలమురళీకృష్ణ, ఎస్.కే.అజీమ్, పామర్తి తిరుమలరావు, పూనెం ప్రదీప్‌కుమార్, సీతారామరాజు, సుంకర శేషు, పాషా, చందు, లల్లు, గోపి, మీరా పాల్గొన్నారు.



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న సత్యనారాయణ